క్లుప్తంగా

రాజగిరి స్మారకార్థం చీరలు, దుప్పట్ల పంపిణీ



చీరలు, దుప్పట్లు పొందిన వారితో చర్చి నిర్వాహకులు

నిడదవోలు: సామాజిక సేవలో ప్రత్యేక స్థానం కలిగిన రాజగిరి సేవలు ఆదర్శప్రాయమని విశాఖకు చెందిన పాస్టర్ డాక్టర్ రెవరెండ్ ఆండ్రెవ్ జయకర్ అన్నారు. స్థానిక రాయిపేటలోని మెంటే సుందరరావు మెమోరియల్ లూథరన్ టౌన్ చర్చిలో సంఘ సేవకుడు, గుడ్ సమరిటన్ సంస్థల వ్యవస్థాపకుడు మెంటే రాజగిరి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. రాజగిరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 100 మంది వృద్ధులు, మహిళలకు చర్చి చైర్‌పర్సన్ మెంటే దయారాజగిరి చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టౌన్ లూథరన్ చర్చి ప్యారిస్ పాస్టర్ రెవరెండ్ ఎం.విజయభాను, సంఘస్తులు కె.సుజ్ఞానరాజు, ఎ.అరుణ, జ్ఞానకుమారి, ఓగూరి ప్రియదర్శిని, మేడేపల్లి ప్రవీణ్‌కుమార్, సుహాస్‌రాజ్ ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

కొలతల్లో తేడాలొస్తే బంక్‌లను సీజ్ చేస్తాం

చాగల్లు: కచ్చితమైన కొలతలతో పెట్రోలు, డీజిల్‌ను వినియోగదారులకు అందించకపోతే చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ విశాఖపట్నం డిప్యూటీ కంట్రోలర్ మధుసూధన్‌రెడ్డి హెచ్చరించారు. ఆ శాఖ అధికారులు శుక్రవారం చాగల్లులోని ఎస్‌ఆర్ పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మధుసుధన్‌రెడ్డి మాట్లాడుతూ విలేకరులతో పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకులను తనిఖీ చేస్తున్నామన్నారు. గుంటూరు నుంచి శ్రీకాకుళం వరకూ గల జిల్లాల నుంచి వచ్చిన అధికారులు బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారని వివరించారు. పెట్రోల్, డీజిల్ డెలివరీ, సీలింగ్ కచ్చితంగా ఉన్నాయో లేదో తనిఖీ చేస్తున్నామని చెప్పారు. అక్రమాలకు పాల్పడిన, కొలతల్లో ప్రమాణాలు పాటించని బంక్‌లను సీజ్ చేస్తామని తెలిపారు. అనంతరం వారు నిడదవోలులోని ఆంధ్ర ఆటో ఏజెన్సీ హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో తనిఖీలు చేశారు. ఆయన వెంట అసిస్టెంట్ కంట్రోలర్ పి.చిన్నమ్మ, ఇన్‌స్పెక్టర్లు బి.అనురాధ, జి.సాయిబాలాజీ, అధికారులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడితో ఐదుగురికి అస్వస్థత

నిడదవోలు రూరల్: తేనెటీగలు ఒక్కసారిగా చెలరేగి రోడ్డుపై వెళుతున్న ప్రయాణికులపై దాడి చేశాయి. ఈ ఘటన మండలంలోని అట్లపాడు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. తేనెటీగల దాడితో ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. వారిని సమిశ్రగూడెం పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందించారు. గాయపడిన వారిలో వేలివెన్ను నుంచి నిడదవోలు వైపు వెళుతున్న మునిపల్లి మాజీ సర్పంచి వీవీ సత్యనారాయణ, అట్లపాడుకు చెందిన పి.మద్దియ్య, డి.వాణి, బి.నవీన్‌కుమార్‌లతో పాటు నిడదవోలుకు చెందిన ఎ.సతీష్ ఉన్నారని వైద్యసేవలు అందించిన పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.అమరేంద్ర తెలిపారు.

వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం

నిడదవోలు: దశలవారీగా పక్కా డ్రైన్లు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టి పట్టణంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. స్థానిక 11వ వార్డులో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు మరమ్మతులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్మన్ యలడాడ బాలరాజు, కౌన్సిలర్లు చిలకల శారదాదేవి, ఎస్‌కే వజీరుద్దీన్, ఉసురిమర్తి జాన్ బాబు, మొదలవలస నాగమణి, గోపిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తొలి దశ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు

గోపాలపురం: మండలంలోని వేళ్లచింతలగూడెంలో నిర్వహిస్తున్న టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు శుక్రవారంతో మొదటి దశ పోటీలు పూర్తయినట్టు నిర్వాహకులు పిన్నమనేని చినబాబు, కొర్లపాటి రాజాలు తెలిపారు. మొత్తం 32 జట్లకు గాను 16 జట్లు పాల్గొన్నాయన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా రంగారావు అండ్ మధుకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.లక్షా 50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.80 వేలు, తృతీయ బహుమతిగా రూ 30 వేల నగదు ఇస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

దేవరపల్లి: రోగుల కోసం దేవరపల్లి పీహెచ్‌సీలో మౌలిక వసతులు కల్పించనున్నట్టు ఆ పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ కేవీకే దుర్గారావు తెలిపారు. ఆ పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరచాలని, విద్యుత్తు, కంప్యూటర్లకు మరమ్మతులకు, ఇన్వర్టర్ బ్యాటరీల కొనుగోలు చేయాలని సమావేశంలో తీర్మానం చేసినట్టు తెలిపారు. సమావేశంలో సర్పంచ్ దేవరపల్లి కడిడి వీరకుమారి, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, వైద్యాధికారి సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పూత కోసం .. ఎన్నెన్ని పాట్లో





జీడిమామిడి తోటలపై రసాయన మందు పిచికారీ చేస్తున్న రైతు (అంతర చిత్రం) మాడిపోతున్న జీడిమామిడి పూత

- మామిడి, జీడిమామిడి తోటలపై రసాయనాల పిచికారీ
- గోపాలపురం నియోజకవర్గంలో 6,800 ఎకరాల్లో తోటలు

నల్లజర్ల: మామిడి, జీడిమామిడి సీజన్ ప్రారంభమైంది. ఈ తోటలకు పూత వచ్చేందుకు, వచ్చిన పూత నిలబడేందుకు రైతులు రసాయన పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. గోపాలపురం నియోజకవర్గంలో 6,800 ఎకరాల్లో మామిడి, జీడిమామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. నియోజకవర్గంలోని ద్వారకాతిరుమల, గోపాలపురం మండలాల్లో అత్యధికంగాను, నల్లజర్ల, దేవరపల్లి మండలాల్లో కొంతమేర ఈ తోటలు ఉన్నాయి. గోపాలపురం, ద్వారకాతిరుమల మండలాల్లో పూత ఆశించిన స్థాయిలో ఉండగా మిగతా రెండు మండలాల్లో తక్కువగా ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. డిసెంబర్ రెండో వారానికే రావాల్సిన పూతలు డిసెంబర్ ముగిసినా కొన్ని ప్రాంతాల తోటలకు ఆశించినంతగా పూత కనిపించడం లేదు. ఏటా సీజన్‌లో కురిసే వర్షాల ప్రభావంతో మామిడి, జీడిమామిడి చెట్లకు అక్టోబర్‌లో చిగుళ్లు వచ్చి డిసెంబర్‌లో పూత కనిపించేది. సరైన సమయంలో పూత రాకపోతే ఆ ప్రభావం దిగుబడులపైన ఉంటుందని రైతులు చెబుతున్నారు. గతేడాది కాపు తక్కువగా ఉన్నందున ఈ ఏడాది దిగుబడులు ఎక్కువగా ఉండవచ్చని రైతులు అంచనా వేస్తున్నారు.



ఉద్యానశాఖాధికారి శ్రీలక్ష్మి

రసాయన మందుల పిచికారీ..

మామిడికి పూత వచ్చేందుకు, వచ్చిన పూత నిలబడేందుకు ఎక్కువగా సల్ఫర్, క్లోరో-50, మల్టీకే, కరాటే వంటి మందులను ఈ ప్రాంత రైతులు పిచికారీ చేస్తున్నారు. ఒక్కో రైతు ఐదుసార్లు ఈ రసాయన ద్రావణాలను స్ప్రే చేస్తున్నట్టు చెబుతున్నారు.

మామిడి పువ్వు మొగ్గదశలో ఉన్న తోటల్లో పూతలను ఉత్తేజ పరిచి, పూత సరిసమానంగా, త్వరగా విచ్చుకోవడానికి మల్టీ-కే 10 గ్రాముల మందును నీటిలో కలిపి పిచికారీ చేయాలని నల్లజర్ల ఉద్యాన శాఖాధికారి శ్రీలక్ష్మి తెలిపారు. అలాగే బోరాన్-2 గ్రాములు, జింక్-2 గ్రాముల మందును కూడా నీటిలో కలిపి పిచికారీ చేయవచ్చన్నారు. దీనివల్ల చెట్లకు పూత శాతం పెరుగుతుందన్నారు. పిందె కట్టు అధికంగా వస్తుందన్నారు. పూత దశలో ఆశించే తేనెమంచు పురుగు, మచ్చ తెగులు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.5 మిల్లీ లీటర్ మందును నీటిలో కలిపి లేదా సాఫ్-2 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి వేపనూనె 10 వేల పీపీఎం పిచికారీ చేయాలన్నారు.

పూతదశలో బూజు తెగులు ఆశిస్తే కాంటాఫ్ మందును రెండు మిల్లీలీటర్ల మందును లేదా అమిస్టార్ ఒక మిల్లీ లీటర్ మందును లీటరు నీటికి చొప్పున పిచికారీ చేయాలన్నారు. మరో 20 రోజుల్లో జీడిమామిడి పూతలు రానట్టయితే తగు చర్యలు చేపట్టాలని శ్రీలక్ష్మి సూచించారు.

దేవరపల్లి ఎస్‌ఈబీ సీఐగా సుధ



సుధ, ఎస్‌ఈబీ సీఐ, దేవరపల్లి

దేవరపల్లి: దేవరపల్లిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎస్‌ఈబీ సీఐగా దిమ్మల సుధ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఆమె పెనుగొండ సీఐగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాలు ఉంటాయన్నారు. సారా తయారీదారులకు మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి సారా నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డిగ్రీ కళాశాలల వద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి యువతకు అవగాహన కల్పిస్తామన్నారు. నల్లజర్ల ఎస్వార్‌కే డిగ్రీ కళాశాల వద్ద ఇప్పటికే హోర్డింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామాల్లో మత్తు పానీయాల అమ్మకాలపై స్టేట్ సెబ్ ఎస్‌ఈబీ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబరు 04500కు ప్రజలు సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు. సర్కిల్ కార్యాలయంలో ఎస్‌ఐ, ఏడుగురు సిబ్బందిని నియమించినట్టు సుధ తెలిపారు.

కొత్త పింఛన్ల పంపిణీ

గోపాలపురం: కొత్తగా మంజూరైన పింఛన్లను మండలంలోని రేగులగుంట గ్రామంలోని లబ్ధిదారులకు రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ళ భాస్కరరావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఐ. శ్రీరామమూర్తి, మాజీ సర్పంచ్ కంకట బ్రహ్మానందం, జి.హరిబాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి చర్యలు తప్పవు

- రక్త పరీక్షలకు బయటకు పంపవద్దు
- కలెక్టర్ మాధవీలత హెచ్చరిక
- కొవ్వూరు సీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ



ఇన్ పేషెంట్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత, చిత్రంలో డీసీహెచ్‌ఎస్ సనత్‌కుమారి

కొవ్వూరు: వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత హెచ్చరించారు. కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి (సీహెచ్‌సీ)లో వైద్య సేవలపై పలు ఫిర్యాదుల వస్తున్న నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ ఆ సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలు, సౌకర్యాల గురించి ఆరా తీశారు. సువిశాలంగా ఉన్న పై అంతస్తును ఇంకా ఆసుపత్రికి అప్పగించలేదు. ఈ విషయమై ఆమె ఫోన్‌లో వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో తాను ఈ ఆసుపత్రిని సందర్శించినపుడు గైనకాలజిస్టు, ఆర్థో, పిల్లల వైద్య నిపుణులు లేరనే విషయం తెలిసిందన్నారు. రోజు ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ప్రకటించారు. ఏరోజు ఏయే వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇక్కడి ల్యాబ్‌లోనే అన్నిరకాల రక్త పరీక్షలు చేస్తున్నారన్నారు. పరీక్షల కోసం ఏ రోగినైనా బయటికి పంపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సీహెచ్‌సీకి వస్తున్న రోగులకు రాజమహేంద్రవరం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నట్టు ప్రధానంగా ఆరోపణలు వస్తున్నాయని కలెక్టర్ మాధవీలత అన్నారు. ఎలాంటి వైద్యం అందించకుండా రిఫర్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్డీవో ఆఫీసులో కంట్రోల్ రూమ్

వైద్య సేవలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ మాధవీలత ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం నుంచి ఈ ఫోన్ నంబర్‌ను అందుబాటులో ఉంచుతామని ప్రకటించారు. సకాలంలో వైద్య సేవలు అందించకపోయినా, వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. పోస్టుమార్టం రూమ్ వద్ద వసతులు మెరుగు పరచాలని కలెక్టర్ ఆదేశించారు. పోస్టుమార్టం నిర్వహణకు వైద్యులు గాని, సిబ్బంది గాని సొమ్ము డిమాండ్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీసీహెచ్‌ఎస్ ఎం.సనత్‌కుమారి, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎం.సుభాషిణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.వరలక్ష్మి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

గెయిల్ ఆధ్వర్యంలో సంచార వైద్య సేవలు

కొవ్వూరు: గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (గెయిల్), ఓ కార్డు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వాడపల్లి వాసులకు శుక్రవారం ఉచితంగా వైద్య సేవలు అందించారు. డాక్టర్ టీఎస్ స్పందన రోగులకు పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం సంచార వైద్యశాల ద్వారా వేములూరు, తోగుమ్మి, బంగారమ్మపేట గ్రామాల్లో కూడా వైద్య సేవలు అందించారు. నిడదవోలు మండలం పురుషోత్తపల్లి, పందలపర్రు, డి.ముప్పవరం, కలవచర్ల గ్రామాల్లోను, రాజానగరం మండలం వడిశలేరు, రాజమహేంద్రవరం రూరల్‌లోను, రాజమహేంద్రవరం నగరంలోని మురికివాడల్లోను సేవలు అదిస్తున్నట్టు వైద్యాధికారి స్పందన వివరించారు. ప్రతి నెలా 24 గ్రామాల్లో తాము సంచార వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఫార్మసిస్టు ఎం.శివనారాయణ, కో-ఆర్డినేటర్ డి.అనూష తదితరులు పాల్గొన్నారు.

గోష్పాదేశ్వరునికి అన్నాభిషేకం



కొవ్వూరులో గోష్పాదేశ్వరస్వామికి అన్నాభిషేకం చేస్తున్న భక్తులు

కొవ్వూరు: ధనుర్మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి సుమారు వంద కిలోల అన్నంతో అభిషేకం చేశారు. ఆ అన్నాన్ని పులిహోర, దద్దోజనంగా చేసి భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఆలయ అర్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో స్థానిక భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. అలాగే వరద గోపాలస్వామి ఆలయంలోని మహాలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఆలయ ఈవో ఎం.బాలకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామివారికి చామంతి పూలతో పూజ చేశారు. ఆలయ అర్చకుడు గోవర్ధనం అనంత గోపాల్, గోవర్ధనం శ్రీనివాసమూర్తి పూజలు నిర్వహించారు.

ఉమారామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: ఆరుద్ర ఉత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఉనకరమిల్లిలో కొలువైన ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు గుట్టి సుబ్రహ్మణ్య సోమయాజులు శర్మ పర్యవేక్షణలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, మృత్యుంజయ రుద్ర హోమం, శాంతి ఆశీర్వచనం నిర్వహించి అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించారు.

సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతి

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- అచ్చన్నపాలెంలో గడప గడపకూ..



అచ్చన్నపాలెం వాసులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో బడుగు, బలహీన వర్గాల వారు అభివృద్ధి చెందుతున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని అచ్చన్నపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ జాలపర్తి సౌజన్య, ఎంపీటీసీ సభ్యుడు కాకర్ల రాజారావు, జాలపర్తి రత్తయ్య, మాజీ సర్పంచ్ బొప్పన సత్తిరాజు, నాయకులు అందుగుల వెంకటేశ్వరరావు, కఠారి రాజ్‌కుమార్, బేతిన బాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శక పాలన అందిస్తున్నామన్నారు. ఇళ్ల స్థలాలు కేటాయించాలని, గృహ నిర్మాణాలకు రుణ సౌకర్యం కల్పించాలని పలువురు గ్రామస్తులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావును కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, పార్టీ నాయకులు బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం, మద్దిపాటి ప్రసాద్, కసుకుర్తి నరసారావు, చెల్లారి రామ శ్రీనివాస్, గుడిశే వీరాస్వామి, ఇమ్మణ్ణి సత్తిపండు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం కార్యదర్శిగా నరేంద్ర

ఉండ్రాజవరం: రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం కార్యదర్శిగా తాడిపర్రు సర్పంచ్ కె.నరేంద్ర ఎన్నికయ్యారు. విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని నరేంద్ర తెలిపారు. భవిష్యత్తులో సర్పంచ్‌ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడానికి తమ సంఘం తరఫున కృషి చేస్తున్నట్టు తెలిపారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

ఉండ్రాజవరం: తిరుపతిలో ఈ నెల 3న సావిత్రీబాయి పూలే ఎక్స్‌లెన్స్ అవార్డులు స్వీకరించిన మండలంలోని ఉపాధ్యాయులు పీఎస్‌వీఎల్ సుభద్ర, ఎ. సూర్యకుమారిలను స్థానిక ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం పలువురు ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ పీవీఎస్ నాగరాజు అభినందించారు.అనంతరం యూటీఎఫ్ మండల శాఖ తరఫున ప్రధాన కార్యదర్శి దువ్వాపు రామారావు ఇరువురినీ ఘనంగా సత్కరించారు. అలాగే ఉండ్రాజవరం హైస్కూల్ ఉపాధ్యాయులు ఐ.నాగసుందరి, కె.మాధవి, జి.జయశ్రీ ఆర్థిక సహకారంతో మండలంలోని ఉపాధ్యాయులకు సెలవు దరఖాస్తు పుస్తకాలు, యూటీఎఫ్ కార్యవర్గ వివరాలతో ముద్రించి అందజేశారు.

ఉపాధ్యాయుడు దానరాజుకు డాక్టరేట్



మొసలి దానరాజు

నిడదవోలు రూరల్: శెట్టిపేట జెడ్పీ హైస్కూల్ సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడు మొసలి దానరాజుకు డాక్టరేట్ లభించింది. చరిత్ర విభాగంలో 'గొంతెలమ్మ కల్ట్, ఏ సోషియో హిస్టారికల్ స్టడీస్ ఆఫ్ వెస్ట్ గోదావరి, కృష్ణ డిస్ట్రిక్ట్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై తాను చేసిన పరిశోధనకు గాను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు ఆయన చెప్పారు. ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి మార్గ నిర్దేశంలో తాను పరిశోధన సాగించినట్టు ఆయన తెలిపారు. డాక్టరేట్ సాధించిన దానరాజును ఆ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు ఎంఎల్ దేవసహాయం తదితరులు అభినందించారు.

తాళ్లపూడిలో బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం



తాళ్లపూడిలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్ రాధిక, జనార్దనరావు

తాళ్లపూడి: గ్రామీణ యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని తహసీల్దార్ టి.రాధిక అన్నారు. ఇన్విటేషన్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ తాళ్లపూడిలోని నక్కా చిట్టిబాబు ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైంది. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు, తహసీల్దార్ టి.రాధిక శుక్రవారం రాత్రి ఈ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. జాతీయ కోచ్ నాగులకొండ వీరభద్రరావు పర్యవేక్షణలో ఈ నెల ఎనిమిదో తేదీ వరకూ మూడు రోజుల పాటు పోటీలు జరుగుతాయని బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నక్కా ఆనంద్ తెలిపారు. సబ్ జూనియర్స్ బాలురు, బాలికలు, జూనియర్స్ బాలురు, బాలికల విభాగాల్లో మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేస్తారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా చిట్టిబాబు, ఆర్‌ఐ క్రాంతి రేఖ, ఏఎస్‌వో జె. వెంకటేశ్వరరావు, నీలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

మహిళ ఆత్మహత్యాయత్నం

కొవ్వూరు: పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని పట్టణానికి చెందిన ర్యాలి ఈశ్వరి అనే వివాహిత గురువారం మధ్యాహ్నం ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసుల కథనం ప్రకారం భర్త చనిపోవడంతో ఆమె దాసరి వరప్రసాద్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఇరువురి మధ్య వివాదాలు తలెత్తడంతో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. బాధితురాలికి వరుసకు కొడుకైన బడేటి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ ఏఎల్‌ఎస్ రవికుమార్ తెలిపారు.

స్కూల్ బస్సును ఢీకొట్టిన క్వారీ లారీ

చాగల్లు: స్కూల్ బస్సును వెనుక నుంచి వస్తున్న క్వారీ లారీ ఢీ కొట్టింది. చాగల్లులోని యూనియన్ బ్యాంక్ సమీపంలో శుక్రవారం ఈ ప్రమాదం సంభవించింది. పంగిడి నుంచి చాగల్లు వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సును వేగంగా వస్తున్న క్వారీ లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. ఆ సమయంలో బస్సు ఆగి ఉండడంతో పెద్ద ప్రమాదం జరగలేదు.విద్యార్థులు క్షేమంగా బయట పడ్డారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాల్వలో జారి పడి వృద్ధురాలి మృతి

నిడదవోలు రూరల్: ప్రమాదవశాత్తూ పశ్చిమ డెల్టా కాలువలోకి జారిపడి గంధం లక్ష్మీకాంతం (67) అనే వృద్ధురాలు మృతి చెందింది. విజ్జేశ్వరం శివార్లలో శుక్రవారం ఉదయం ఈ ప్రమాదం జరిగిందని సమిశ్రగూడెం పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు. లక్ష్మీకాంతం సొంతూరు కొవ్వూరు మండలం మద్దూరు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆమె ఆరు నెలల క్రితమే ఆపరేషన్ చేయించుకుంది. క్రమంగా కోలుకుంటున్న లక్ష్మీకాంతం శుక్రవారం ఉదయం కాలువ రేవులో దుస్తులు ఉతుకుతూ జారిపడి గల్లంతైంది. ఆమె మృతదేహం విజ్జేశ్వరం శివార్లలో లభ్యమైంది. దీనిపై ఆమె కుమారుడు వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి

దేవరపల్లి: ఇక్కడి నుంచి గోపాలపురం వెళ్లే రోడ్డుపై అవంతి ఫీడ్స్ పరిశ్రమ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో జంగారెడ్డిగూడెంకు చెందిన కారు డ్రైవర్ ఆలపాటి సందీప్ ఫణి చౌదరి (24) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం ఆ యువకుడు దేవరపల్లి వైపు నుంచి గోపాలపురం వైపు కారు డ్రైవ్ చేసుకుంటూ వెళుతున్నాడు. ముందు వెళుతున్న లారీని తప్పించబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడిని గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు దేవరపల్లి ఎస్సై శ్రీహరిరావు తెలిపారు.

చోరీ కేసులో ఆరు నెలల జైలుశిక్ష

నిడదవోలు రూరల్: బైక్ చోరీకి పాల్పడిన కేసులో మండలంలోని డి.ముప్పవరానికి చెందిన షేక్ హబీబుల్లాకు ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష విధిస్తూ నిడదవోలు కోర్టు జడ్జి ఎ.కృష్ణప్రసాద్ తీర్పు చెప్పినట్టు ఎస్సై షేక్ సుభానీ శుక్రవారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం గతేడాది ఏప్రిల్ 28న డి.ముప్పవరంలో యడ్ల మిస్సమ్మకు చెందిన యాక్టివ్ మోటర్‌సైకిల్ దొంగిలించిన కేసులో హబీబుల్లాను గణపవరం పోలీసులు అరెస్టు చేశారు. ఈకేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు హబీబుల్లాకు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయండి

కొవ్వూరు: పట్టణంలో చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి ఆదేశించారు. పట్టణంలో జరుగుతున్న పైప్‌లైన్ పనులను శుక్రవారం సాయంత్రం ఆమె పరిశీలించారు. పదిహేనో ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.19 లక్షల వ్యయంతో వాటర్ వర్క్స్ నుంచి అచ్చాయమ్మ కాలనీకి వెళ్లే ప్రధాన పైప్‌లైన్‌కు కలుపుతూ ఈ లైన్ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, ఏఈ దుర్గా కిషోర్, మాజీ కౌన్సిలర్ భావన రాజేష్ (బెన్ని) తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే వ్యర్థాలతో ఇబ్బందులు

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలోని తాడిపర్రు వెళ్లే రోడ్డులో శ్మశానం పక్కన ఊరిలోని చెత్తను డంపింగ్ చేయడం వలన ఆ ప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నారని మండల కులవివక్ష పోరాట సమితి నాయకుడు రాయుడు సువర్ణరాజు అన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఉండ్రాజవరం పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించి కార్యదర్శి సుదీప్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తకు నిప్పంటించడం వలన పొగతో పాటు తీవ్ర దుర్గంధం వస్తోందన్నారు. దాంతో అక్కడి ఎస్సీ ఏరియా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆందోళనలో కె.వసంతరావు, కాకిలేటి చంద్రరావు, బాలు చిన్న శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్షయ రోగులకు పౌష్టికాహారం అందజేత

చాగల్లు: దాతల సహకారంతో చాగల్లు పీహెచ్‌సీలో క్షయ వ్యాధిగ్రస్తులకు శుక్రవారం పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.సౌజన్య మాట్లాడుతూ గ్రామానికి చెందిన మట్టా గంగరాజు అనే దాత ఆరు నెలల పాటు వ్యాధిగ్రస్తులకు ఆహారం అందించడానికి ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో టీబీ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ ఆర్.పోతురాజు, ఎంపీహెచ్‌ఈవో కాటంరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.